సాక్షి
ఆదిలాబాద్
ఆదివారం । 1 । జనవరి । 2023



రిమ్స్ మెడికల్ కాలేజీలో కేక్ కట్ చేస్తున్న మెడికోలు



కేక్ తినిపించుకుంటూ..



సంబరాల్లో యువతులు

'నయా' జోష్

జిల్లావ్యాప్తంగా నూతన సంబరాలు అంబరాన్నంటాయి. శనివారం సాయంత్రం నుంచే '31' వేడుకలు షురూ అయ్యాయి. చిన్నా పెద్ద తేడా లేకుండా అందరిలో నయా జోష్ కనిపించింది. సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకు 'హ్యాపీ న్యూ ఇయర్..' అంటూ కేరింతలతో 2023కు గ్రాండ్‌గా వెల్‌కమ్ పలికారు. యువత, చిన్నారులు డీజే పాటలకు స్టెప్పు లేస్తూ సంబరాల్లో మునిగితేలారు. కేక్‌లు కట్ చేసి ఒకరికొకరు తినిపించుకున్నారు. నూతన శుభాకాంక్షలు తెలుపుకున్నారు. –ఆదిలాబాద్



ఆదిలాబాద్‌లోని తిరుమల క్లాసిక్ గార్డెన్‌లో న్యూఇయర్ సంబరాల్లో యువకుల నృత్యం

న్యూస్‌రీల్

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కైలాస్‌నగర్: జిల్లాలోని కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్‌సీ)ల్లో పనిచేసే ఉద్యోగుల సంఘం (వీఎల్ఈ సొసైటీ) ఆధ్వర్యంలో ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను కలెక్టర్ సిక్తా పట్నాయక్ తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ సొసైటీ సభ్యులు కలెక్టర్‌కు దుప్పట్లు, నోటు పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రవి, సీఎస్‌సీ జిల్లా మేనేజర్ రాహుల్, సొసైటీ ప్రెసిడెంట్ అంబాజీ, వైస్ ప్రెసిడెంట్ మహేశ్, ప్రధాన కార్యదర్శి రాంప్రసాద్, సంయుక్త కార్యదర్శి ప్రశాంత్ , కోశాధికారి రాజేందర్, సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

పుష్పగుచ్ఛాలు వద్దు... బ్లాంకెట్లు, స్టేషనరీ ఓకే

కైలాస్‌నగర్: నూతన సంవత్సరం పురస్కరించుకుని కలెక్టర్ సిక్తా పట్నాయక్ వినూత్న నిర్ణయం తీసుకున్నారు. పేద విద్యార్థులకు అండగా నిలువాలని సంకల్పించారు. ఇందులో భాగంగాతనకు శుభాకాంక్షలు తెలిపేందుకు వచ్చే అధికారులు,ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు, మిఠాయిలు తీసుకురావద్దని ప్రకటనలో సూచించారు. బదులుగా పేదలు, విద్యార్థులకు ఉపయోగపడేలా బ్లాంకెట్లు, పెన్నులు, నోట్ పుస్తకాలు వంటి స్టేషనరీ సామగ్రి తీసుకురావాలని ఆమె పేర్కొన్నారు.

కలెక్టరేట్‌లో 'నూతన' వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఆర్డీవో రమేశ్‌రాథోడ్

కైలాస్‌నగర్: నూతన సంవత్సర వేడుకలను కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించారు. ఆర్డీవో రమేశ్ రాథోడ్ కేక్ కట్ చేశారు. అధికారులు, ఉద్యోగులు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో అరవింద్‌కుమార్, సూపరింటెండెట్లు ఏ.రాజేశ్వర్, స్వాతి, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి



రమ్యను సన్మానిస్తున్న పార్థసారథి తదితరులు

ఆదిలాబాద్: లక్ష్యసాధనలో ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగితే అద్భుతాలు సృష్టించవచ్చని జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ క్రీడా పాఠశాల పదో తరగతి విద్యార్థిని సపావత్ రమ్య పంజాబ్‌లోని పటియాలలో గల నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లోని నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (ఎన్‌సీఓఈ)కు జూడో క్రీడాంశంలో ఎంపికైంది. ఈ మేరకు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలోని జూడో హాల్‌లో శనివారం ఆమెను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతన సంవత్సరంలో క్రీడా పాఠశాల విద్యార్థులు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జూడో కోచ్ రాజు, ఇరిగేషన్ డీఈ మనోహర్, అథ్లెటిక్స్ కోచ్ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ ఇక్బాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విన్యాసాలు



2023 ఆకారంలో విద్యార్థులు

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని మావల మహాత్మ జ్యోతి బాపూలే బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన పిరమిడ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. నూతన సంవత్సరం సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులు పలు ఆకృతుల్లో విన్యాసాలు ప్రదర్శించారు.కార్యక్రమంలో జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలల ఆర్‌సీవో గోపీచంద్, ప్రిన్సిపాల్ రంగన్న, వైస్‌ప్రిన్సిపాల్ శ్రీలత, వార్డెన్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

కొత్త ఆశలతో 2023

- 2023కు స్వాగతం పలికిన జిల్లావాసులు
- పాలకుల నోట.. ప్రగతి బాట
- గిట్టుబాటు దక్కాలని అన్నదాత
- 'కొలువు' దీరాలని నిరుద్యోగులు
- డిమాండ్లు నెరవేరాలని ఉద్యోగులు
- నూతన ఆశయాలు.. ఆకాంక్షలతో ముందుకు

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: కోటి ఆశలు.. కొత్త ఆశయాలతో జిల్లావాసులు జోష్‌గా 2023కు వెల్‌కమ్ చెప్పేశారు. ఈ ఏడాది అనుకున్న లక్ష్యాలు నెరవేరాలని సర్వత్రా ఆశిస్తున్నారు. జిల్లాను విద్య, వైద్యం తదితర అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలిపేందుకు ఓ వైపు అధికార యంత్రాంగం.. మరోవైపు ప్రజాప్రతినిధులు ఆకాంక్షిస్తున్నారు. ఇందుకోసం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతామంటున్నారు. ఇటీవల వరుస నోటిఫికేషన్ల నేపథ్యంలో సర్కారు ఉద్యోగమే లక్ష్యంగా నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతోంది. ఈ ఏడాది ఎలాగైనా 'కొలువు' దీరాలని భావిస్తోంది. గతేడాది సాగు నిరాశ మిగల్చగా.. ఈసారైనా తమ పంట పండాలని అన్నదాత ఆశపడుతున్నాడు. వరణుడి కరుణతోపాటు గిట్టుబాటు దక్కాలని వేడుకుంటున్నాడు. నేరాలు–ఘోరాలకు అడ్డుకట్ట వేయాలని పోలీసు శాఖ భావిస్తుండగా.. 'ఆమె'పై అఘాయిత్యాలు ఆగాలని మహిళాలోకం కోరుకుంటోంది. సమస్యల పరిష్కారం కోసం ఉపాధ్యాయ, ఉద్యోగవర్గాలు ఎదురుచూస్తున్నాయి. ఈ నూతన సంవత్సరం అందరి ఆకాంక్షలు నెరవేరాలని ఆశిస్తూ.. హ్యాపీ న్యూ ఇయర్.

రాష్ట్ర ప్రభుత్వం సహకరించాలి



ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలన్నా రాష్ట్ర ప్రభుత్వ సహకారం తప్పనిసరి. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ దిశగా సహకరించడం లేదు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్‌కు రాష్ట్ర ప్రభుత్వం 40శాతం నిధులివ్వాల్సి ఉంది. జిల్లా కేంద్రంలో ఎయిర్ పోర్టు నిర్మాణానికి ఎన్‌ఓసీ ఇవ్వడం లేదు. వీటికి రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే నా వంతు కృషి చేస్తా. అభివృద్ధి పనులు వేగవంతం అవుతాయి. పార్లమెంట్ పరిధిలోని పలు మండలాల్లో రోడ్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు పంపితే వాటి నిర్మాణానికి అవసరమైన నిధులు తెప్పించేలా కృషి చేస్తా. ప్రజలకు అందుబాటులో ఉంటూ కేంద్ర పరంగా ఎలాంటి సహాయ, సహకారాలు అవసరమైనా అందించేందుకు సిద్ధంగా ఉన్నా.

– సోయం బాపూరావు, ఎంపీ, ఆదిలాబాద్

అభివృద్ధికి శాయశక్తులా కృషి



నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తా. నూతన సంవత్సరంలో కులమతాలకు అతీతంగా ప్రజలందరు కలిసిమెలిసి ఉండాలి. అందరి మధ్య ప్రేమానురాగాలుండాలి. ఆరోగ్యంతో పాటు ఐశ్వర్యం కలగాలని కోరుతున్నా. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ. కొత్త ఏడాది నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం. గతంలో చేపట్టి పూర్తి కాని వాటిని ఈ ఏడాదిలో పూర్తి చేస్తాం. ఏ పనుల్లోనూ అంతరాయం కలుగకుండా చూస్తాం. జిల్లా సస్యశ్యామలంగా ఉండడానికి ప్రయత్నం సాగిస్తాం. ఇందుకు ప్రజల సహాయ సహకారాలు ఉండాలని కోరుతున్నా.

– జోగు రామన్న, ఎమ్మెల్యే, ఆదిలాబాద్

రక్తహీనత నియంత్రణకు చర్యలు



జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో రక్తహీనత సమస్య ఎక్కువగా ఉంది. ప్రసవం కోసం ఆసుపత్రులకు వచ్చే గర్భిణుల్లో చాలామంది ఈ సమస్యతో బాధపడుతున్నారు. మహిళలు, చిన్నారుల్లో దీనిని నియంత్రించేందుకు ఇప్పటికే దృష్టిసారించాం. ముమ్ముందు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ అందించడంతో పాటు పోషకాహారం తీసుకునేలా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. అలాగే జిల్లాను అన్ని రంగాల్లో ముందు వరుసలో నిలిపేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతాం. అర్హులందరికీ సంక్షేమ, అభివృద్ధి ఫలాలు అందేలా చూస్తాం.

– సిక్తా పట్నాయక్, కలెక్టర్

అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం



జిల్లాలో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నాం. గంజాయి, మట్కా తదితర వాటిపై ఉక్కుపాదం మోపుతున్నాం. ఎంతటివారైనా ఉపేక్షించేది లేదు. ఫ్రెండ్లీ పోలీస్‌ను పకడ్బందీగా అమలు చేస్తాం. మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టేవిధంగా చూస్తాం. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నాం. ప్రతి ఒక్కరూ సహకరించాలి. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు.

– ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ

నాణ్యమైన వైద్యసేవలే లక్ష్యం..



కొత్త ఏడాదిలో రిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఇన్‌పేషంట్ సేవలను ప్రారంభిస్తాం. ఇందులో అంజియోగ్రాం, అంజియోప్లాస్టీ, యూరాలజీ, న్యూరాలజీ, 2డి–ఇకో, న్యూరో సర్జరీలను ప్రారంభిస్తాం. ప్రస్తుతం రిమ్స్‌లో 120 ఎంబీబీఎస్ సీట్లు ఉన్నాయి. 150కి పెంచేందుకు కృషి చేస్తాం. పీజీ సీట్ల పెంపుకోసం ఎన్ఎంసీకి దరఖాస్తు చేశాం. నాణ్యమైన వైద్యసేవలు అందించడమే ముఖ్య లక్ష్యం.

– జైసింగ్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనిస్తాం. జిల్లాకేంద్రాన్ని బల్దియాను అన్నిరంగాల్లో ప్రగతిబాట పట్టించేలా చర్యలు తీసుకుంటాం. అభివృద్ధి పనుల్లో పారదర్శకత ఉండేలా శ్రద్ధ వహిస్తాం. కౌన్సిల్, ప్రజలకు మధ్య అనుసంధాన కర్తగా విధులు నిర్వహిస్తా.

– ఎ.శైలజ, మున్సిపల్ కమిషనర్, ఆదిలాబాద్

విద్యారంగ సమస్యలు పరిష్కారమవ్వాలి



కొత్త ఏడాదిలోనైనా ఉపాధ్యాయ సమస్యలు పూర్తిగా పరిష్కారం కావాలని ఆశిస్తున్నాం. ఐదేళ్లుగా బదిలీలు, పదోన్నతులు లేవు. ఉపాధ్యాయ లోకం వీటి కోసం నిరీక్షిస్తోంది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలి. స్కావెంజర్లు, వీవీల నియమకాలు చేపట్టాలి.

– శ్రీకాంత్, టీయూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు

రైతుకు గిట్టుబాటు ధర అందాలి



రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర అందాలి. రైతు ఆత్మహత్యలు జరగకుండా రెవెన్యూ శాఖ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం వచ్చే పంటల సాగుపై అన్నదాతకు అవగాహన కల్పించాలి. జిల్లాలో ప్రతి ఎకరాకు నీటి లభ్యత ఉండేలా ప్రాజెక్టులు, చెరువుల నిర్మాణం చేపట్టాలి.

– సంగెపు బొర్రన్న, రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు

కొలువు సాధించడమే లక్ష్యం



ప్రభుత్వం వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవల నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఈ ఏడాది కొలువు సాధించాలనే లక్ష్యంతో ప్రణాళికాబద్ధంగా చదువుతున్నా. ఇలాంటి అవకాశం మళ్లీ మళ్లీ రాదు. కచ్చితంగా సద్వినియోగం చేసుకుంటా.

– భాస్కర్, నిరుద్యోగి, ఆదిలాబాద్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి. గతేడాది మన రాష్ట్రపతిగా మహిళ ఎన్నికవడం అందరికీ గర్వకారణం. 2023లో దేశం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి. మహిళలపై దాడులు, అత్యాచారాలు తగ్గాలి. మహిళలంతా తమ మగ పిల్లలకు సంస్కారం, సభ్యత నేర్పించాలి. అప్పుడే 'ఆమె'పై అఘాయిత్యాలు తగ్గుముఖం పడతాయి.

– స్వర్ణకుమారి, ఆదిలాబాద్

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పిస్తాం

- అదనపు కలెక్టర్ రిజ్వాన్‌బాషాషేక్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్ రిజ్వాన్‌బాషా తదితరులు

కైలాస్‌నగర్: గ్రామాల్లో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని అదనపు కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్ అన్నారు. రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హైదరాబాద్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, గ్రామీణాభివృద్ధి, పంచాయతీ అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులనుద్దేశించి మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల వివరాలు ప్రజలకు తెలిపేలా బోర్డుల ఏర్పాటుతో పాటు విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రామాల్లో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుధ్య నిర్వహణ పనులు నిరంతరం చేపట్టేలా శ్రద్ధ వహించాలని మండల పంచాయతీ అధికారులను ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు అందుబా టులో ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కిషన్, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గణపతి, అడిషనల్ డీఆర్డీవో రవీందర్ రాథోడ్, ఎంపీవో తదితరులు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్‌తో క్రమశిక్షణ



దుస్తులు పంపిణీ చేస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఆదిలాబాద్‌రూరల్: విద్యార్థుల్లో క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు స్కౌట్స్ అండ్ గైడ్స్ దోహదపడుతుందని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దిలీప్‌కుమార్ అన్నారు. జిల్లాలోని 16 ఆశ్రమ పాఠశాలల్లో స్కౌట్స్ అండ్ గైడ్స్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలోని కొలాం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన యూనిట్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. ముందుగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా గిరిజన క్రీడల అభివృద్ధి అధికారి కోరెడ్డి పార్థసారథి, ఏటీడీవో నిహారిక, స్కౌట్స్ అండ్ గైడ్స్ కోఆర్డినేటర్లు యాదవ్‌రావ్, శాస్త్రి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ

గుడిహత్నూర్: మండలంలోని తోషం గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలను ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్ తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులు, వంట గది పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న భోజన వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులు, సిబ్బందితో మాట్లాడారు. టీచింగ్ డైరీ, పాఠ్యాంశ ప్రణాళిక, అక్షర జ్యోతి కార్యక్రమ అమలు తీరుపై ఆరా తీశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట హెచ్ఎం అభిమాన్, సిబ్బంది ఉన్నారు.

రెండు బైక్‌లు ఢీ

బేల: మండలంలోని సిర్సన్న గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఎదురెదురుగా రెండు బైక్‌లు శనివారం రాత్రి ఢీకొన్నాయి. ఆదిలాబాద్‌లోని ఖానాపూర్‌కు చెందిన కమల్‌కార్‌ కాలు విరుగగా, చప్రాల(బేల)కు చెందిన సుదర్శన్‌కు తలకు గాయాలయ్యాయి. ఈఎంటీ సాయికిరణ్‌, పైలెట్‌లు గాయపడ్డ వారిని వెంటనే 108లో ప్రాథమిక వైద్యచికిత్సలు అందించి, రిమ్స్‌కు తరలించారు.



‘నూతన’ లక్ష్యమే..

తీపి, చేదు జ్ఞాపకాలతో 2022 ముగిసింది. కొత్త ఆశయాలు, ఆలోచనలకు యువత, విద్యార్థులకు 2023 నూతన సంవత్సరం స్వాగతం పలుకుతోంది. తల్లిదండ్రుల కలలను సాకారం చేసే బాధ్యత వారిపై ఉంది. న్యూఇయర్‌ సందర్భంగా యువత, విద్యార్థుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

కరోనా మహమ్మారి పోవాలి



కరోనా కారణంగా గత రెండేళ్ల విద్యా వ్యవస్థ కుంటుపడింది. గత మే నుంచి కేసులు తగ్గుముఖం పట్టాయి. మళ్లీ కరోనా భయం గుబులురేపుతోంది. ఈ ఏడాది కరోనా తగ్గుముఖం పట్టి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నా.

– ఎస్‌.శ్రీజ, విద్యార్థిని, టీచర్స్‌ కాలనీ, ఆదిలాబాద్‌

సంకల్పంతో ముందుకు



కొత్త సంవత్సరం అనగానే అందరు పార్టీలు.. ఎంజాయ్‌మెంట్‌ అనుకుంటారు. నిజానికి కొత్త సంకల్పంతో ముందుకు సాగాలి. వాటిని ఏ విధంగా అమలు పర్చాలో లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి. మనలో ఉన్న ప్రతిభను వెలికితీయాలి. సమసమాజ నిర్మాణానికి పాటుపడాలి.

– కె.జాహ్నవి, డైట్‌ విద్యార్థిని, ఆదిలాబాద్‌

కొత్త ఆశయాలతో..



అనుకున్న లక్ష్యాలను ఆచరణలో పెట్టేందుకు కష్టపడాలి. గత అనుభవాలను నెమరువేసుకుని ముందుకు సాగాలి. భావితర గురువులైన డైట్‌ విద్యార్థులు ఏ విధంగా బోధించాలనేది శిక్షణ పొందుతాం. దేశ భవిష్యత్తు తరగతి గదిలో ఉంది. డీఎడ్‌ పూర్తి చేసి టీచర్‌ కాలనేది లక్ష్యం. అందుకు అనుగుణంగా కష్టపడతాను.

– ఎం.జాహ్నవి, డీఎడ్‌ విద్యార్థిని, ఆదిలాబాద్‌

విలువలతో కూడిన ఆనందం



కొత్త సంవత్సరంలో తెలియని విషయాలను తెలుసుకోవాలని ఉంది. కొత్త ఆశయాలతో ముందుకు సాగుతాను. విలువలతో కూడిన ఆనందం పొందాలనుకుంటున్నాను. ఈ ఏడాది ఎలాంటి వ్యాధులు రాకుండా ఉండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని, ఆర్థిక రంగంలో ముందుకు సాగాలని ఆశిస్తున్నా.

– సి.కావ్య, విద్యార్థిని, శివాజీచౌక్‌, ఆదిలాబాద్‌

కష్టపడి చదువుతా



విద్యార్థిలోకం క్రమశిక్షణ, పట్టుదల, ఉన్నత ఆశయాలతో ముందుకు సాగాలి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో లక్ష్యాన్ని ఏర్పర్చుకొని చదువుకుంటే తప్ప అనుకున్న స్థాయికి చేరుకోలేం. గ్రూప్‌–1 అధికారి కావడమే నా ముందున్న లక్ష్యం. అందుకు అనుగుణంగా కష్టపడి చదువుతాను. మా అమ్మనాన్న కలలను సాకారం చేస్తా.

– ముస్రాత్‌ ఉన్నీసా, విద్యార్థిని, ఆదిలాబాద్‌

లక్ష్యంతో ముందుకు సాగుతా



విద్యార్థిలోకమందరికీ నూతన సంవత్సరం శుభాకాంక్షలు. కొత్త ఆశయాలతో ఈ ఏడాది ముందుకు సాగుతాం. ప్రతి విద్యార్థి ప్రయోజకులు కావాలని ఆశిస్తాను. సమాజానికి విద్యార్థి లోకం కీర్తి తెచ్చే విధంగా వ్యవహరించాలి. పోటీ పరీక్షలకు సిద్ధమై ఉద్యోగాలు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతాను.

– బి.రాజేశ్వరి, విద్యార్థిని, సంజయ్‌నగర్‌, ఆదిలాబాద్‌







‘భైరి’ వెనుక ఉన్నది బీఆర్‌ఎస్సే

- ఎంపీ సోయం బాపురావు



మాట్లాడుతున్న ఎంపీ సోయం బాపురావు

భైంసాటౌన్‌: అయ్యప్పస్వామి, హిందూదేవుళ్లపై భైరి నరేశ్‌ వ్యాఖ్యల వెనుక బీఆర్‌ఎస్‌ కుట్ర దాగి ఉందని ఆదిలాబాద్‌ ఎంపీ సోయంబాపురావు ఆరోపించారు. శనివారం సాయంత్రం భైంసాలో ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌కు ఓటమి భయం పట్టుకుందని, రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం నెలకొన్న నేపథ్యంలో ఎంఐఎం పార్టీతో కలిసి ఇలాంటి కుట్రలకు తెరలేపిందన్నారు. భైరి నరేశ్‌పై రాష్ట్రవ్యాప్తంగా 150కిపైగా కేసులు నమోదైతే, పీడీ యాక్టు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. హిందూదేవతలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవడంలో బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు సరైన రీతిలో సమాధానం చెబుతారన్నారు. ఆదిలాబాద్‌ పార్లమెంట్‌ కన్వీనర్‌ అయ్యన్నగారి భూమయ్య, బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి రామారావ్‌ పటేల్‌, నాయకులు బి.గంగాధర్‌, గోపాల్‌సర్డా, రవిపాండే పాల్గొన్నారు.

బైక్‌లను ఢీకొన్న కారు

- ఇద్దరికి తీవ్ర గాయాలు

భైంసారూరల్‌: మండలంలోని తిమ్మాపూర్‌ వద్ద ఓ కారు బైక్‌లను వెనుక వైపు నుంచి ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి.. కుంటాల మండలం అందకూర్‌కు చెందిన ప్రణయ్‌, శ్రీనివాస్‌ బైక్‌లపై గ్రామానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో లోకేశ్వరం మండలం పాటపెల్లికి చెందిన లక్ష్మణ్‌ కారులో వెనుకవైపు నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో బైక్‌లపై ప్రయాణిస్తున్న శ్రీనివాస్‌, ప్రణయ్‌కు తీవ్రగాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో నిర్మల్‌ ఆస్పత్రికి తరలించారు.





రాయిసెంటర్ల సేవలు అభినందనీయం

- ఆదిలాబాద్‌ కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌



మాట్లాడుతున్న సిక్తా పట్నాయక్‌

ఉట్నూర్‌: ఏజెన్సీ ప్రాంతాల్లోని ఆదివాసీ గూడేల్లో సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన రాయిసెంటర్లు అందిస్తున్న సేవలు అభినందనీయమని ఆదిలాబాద్‌ కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌ అన్నారు. మండల కేంద్రంలోని కేబీ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన రాయిసెంటర్ల 36వ వార్షికోత్సవ సమావేశానికి ఐటీడీఏ పీవో వరుణ్‌రెడ్డితో కలిసి ఆమె హాజరయ్యారు. ముందుగా కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారికి ఆదివాసీ సంప్రదాయబద్ధంగా ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్‌ మాట్లాడారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 120 రాయిసెంటర్లు పనిచేస్తున్నాయని తెలిపారు. ఆదివాసీల జీవన విధానంతో మార్పులు తీసుకువచ్చేందుకు ప్రభుత్వం ఐటీడీఏ ద్వారా సంక్షేమ ఫలాలు అమలు చేస్తోందన్నారు. ఇటీవల రాష్ట్రంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పర్యటన సందర్భంగా ఆదివాసీల జీవన విధానం గురించి వివరించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో గిరిజనులకు మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణులకు కేసీఆర్‌ న్యూట్రిషన్‌ కిట్లు అందిస్తున్నామని అన్నారు. ఉద్యాన పంటలు, వివిధ రకాల పంటల సాగు కోసం గిరిజన రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు తెలిపారు.

ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

ఏజెన్సీ ప్రాంతాల్లోని 2 వేల గిరిజన గ్రామాలను ఆదర్శ పంచాయతీలుగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్‌ తెలిపారు. గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్టార్స్‌ 50 శిక్షణ కేంద్రం ద్వారా విద్యార్థులకు ఉన్నత చదువులకు అవకాశం లభించేలా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. 300 మంది గిరిజన రైతులకు గిరివికాసం పథకం ద్వారా బోరు బావులు, విద్యుత్‌ మోటార్లు మంజూరు చేశామన్నారు. గోండు భాషా రక్షణ కోసం వివిధ రచనలు అనువాదం చేస్తామన్నారు. అనంతరం హైమన్‌ డార్ఫ్‌ 36వ వర్ధంతి సభ కరపత్రాలు ఆవిష్కరించారు. సమావేశంలో ఆదిమ గిరిజన సలహా మండలి చైర్మన్‌ కనక లక్కెరావ్‌, ఏపీవో పీటీజీ భాస్కర్‌, రాయిసెంటర్‌ ఉమ్మడి జిల్లా గౌరవ అధ్యక్షుడు దుర్గు పటేల్‌ పాల్గొన్నారు.







